# నన్ను క్షమించు నాన్నా!

◆ డా. జె. చలం ◆

**అనంతపురంలో జయలక్ష్మి కాలనీ, రెండో వీధి మొదటి ఇంట్లో ఎప్పటిలాగే వాతావరణం ప్రశాంతంగా ఉంది.**

సూరీడు ఆకాశంలో అప్పుడే డ్యూటీలో చేరాడు. వంటింట్లో చట్నీ తయారుచేసి, ఇడ్లీకి పిండి కలుపుతోంది రామలక్ష్మి. ఉదయం ఏడుగంటలు దాటింది. హఠాత్తుగా 'దబ దబ' బాదుతున్న శబ్దం విని రామలక్ష్మి బెడ్‌రూం వేపుగా పరుగుతీసింది. వేలెడంత కూడా లేని కూతురు ప్రశాంతిని గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు ఆదినారాయణ. గబగబ మధ్య దూరి చేతులడ్డం పెట్టింది. రెండు దెబ్బలు ఆమెకూ తగిలాయి.

''ఏమిటండీ! ఏం జరిగింది? ఎందుకలా కొడుతున్నారు'' అడిగింది.

''నువ్వు ముందు పక్కకు జరుగు. తరువాత చెబుతా'' తీక్షణంగా అన్నాడు ఆదినారాయణ.

''పాప వెక్కిళ్ళు పెడుతూంది. బుగ్గలు ఎలా కందిపోయాయో చూడండి. ఇంకా కొట్టడానికి మీకు చేతులెలా వస్తున్నాయి?''

''కొడతావో చంపేస్తానో నా ఇష్టం. పదిసార్లు చెప్పినా ఈ చిన్న స్పెల్లింగ్ నేర్చుకోలేదా. ఈ రోజు దీనికి తిండి కూడా పెట్టొద్దు.'' అని డ్రెస్ మార్చుకుని తలుపు మూసి తాళం వేసుకుని బయటికెళ్ళిపోయాడు.

''అయ్యయ్యో. ప్రశాంతిని గదిలోనే ఉంచి తాళం వేశారేమండీ! తియ్యండి. ప్లీజ్. ఏమండీ!'' అన్న మాటలు భర్త చెవిని చేరనే లేదు.

మెల్లిగా కిటికీ దగ్గరకెళ్ళి ప్రశాంతిని పిలిచింది రామలక్ష్మి. అది వాళ్ళ నాన్నను మించిన మొండిది. ఎంత పిలిచినా రాదే! ఎంతో బతిమాలితే వెక్కిళ్ళతోనే కిటికీ దగ్గరకొచ్చింది. కిటికీ కడ్డీల్లోంచి బుగ్గమీది కన్నీరు తుడిచింది. అది అంత ఏడుస్తున్నా శబ్దం మాత్రం బయటకు రావటం లేదు. ఏడవకూడదని వాళ్ళ నాన్న ఆర్డరు వేశాడు కాబోలు! అందుకని బయటకు వినిపించకుండా లోలోపలే కుళ్ళి కుళ్ళి ఏడుస్తూంది. అలా నిర్విరామంగా ఏడుస్తూన్న కూతుర్ని చూసి రామలక్ష్మి కడుపు తరుక్కుపోయింది. భర్త మీద చెప్పరాని కోపం వచ్చింది. కానీ తనేం చెయ్యగలదు. డ్రాయింగ్ రూంలోని సోఫాలో కూలబడి తనూ ఏడ్చింది.

''ఆఫీసు టైం అయింది. బజారు నుండి అటే ఆఫీసు కెళ్ళుంటారు. ఆయన ఇప్పుడు ఇంటికి రారు'' అని నిర్ధారించుకుని రామలక్ష్మి ఓ ప్లేటులో నాలుగిడ్లీలు, కొంచెం చట్నీ కిటికీలోంచి లోపలకు తోసింది. పాప ససేమిరా ముట్టలేదు.

ఎంత బతిమిలాడినా వింటేనా. ఆ రోజు చేసిన టిఫిన్ చిచ్చుగాళ్ళ పాలయింది. కిటికీ ఊచలు పట్టుకుని తదేకంగా పాపనే చూస్తున్న రామలక్ష్మి మనసు గతంలోకి పరుగులు తీసింది. తనూ, ఆదినారాయణ పన్నెండేళ్ళ క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అది కులాంతరం కాకపోయినా పెద్దల కిష్టం లేని పెళ్ళయినందువలన, ఆయిన వాళ్ళందరూ దూరమయ్యారు. నాలుగేళ్ళ తరువాత పుట్టిన ప్రశాంతిని ఎంతో అపురూపంగా పెంచుకుంటున్నారు. కూతురిని ఎంత ప్రేమగా చూసుకున్నా ఆదినారాయణ చదువులో మాత్రం చండశాసనుడు. ఏ చిన్న తప్పుజరిగినా క్షమించకుండా బెల్టుతో వాతలు పడేలా కొట్టేవాడు. ఏమని అడిగితే 'క్రమశిక్షణ' అంటూ పెద్ద లెక్చరిచ్చేవాడు.

ఇప్పుడు ప్రశాంతికి ఏడేళ్ళు. ఎంతో బాగా చదువుతుంది. క్లాసులో ఎప్పుడూ ఫస్ట్ ర్యాంక్ వస్తుంది. టీచర్లందరూ ప్రశాంతిని ఎంతో మెచ్చుకుంటారు. చదువులో ఎంత ముందున్నా వాళ్ళ నాన్నకి తృప్తిలేదు. ఏ చిన్న స్పెల్లింగో లేదా లెక్కనో పట్టుకుని తనకు నచ్చిన రీతిలో నేర్చుకోలేదని సతాయిస్తారు. మధ్యలో తను కల్పించుకున్నా ఏమీ ప్రయోజనం ఉండదు. తన మాట వినరు. జీవితంలో అన్నీ వున్నా ఈ ఒక్క వెలితి తనను ఎంతో కలచివేస్తూంది. డోర్ బెల్ మ్రోగడంతో ఈ లోకంలోకి వచ్చి తలుపు తీసింది రామలక్ష్మి. ఆఫీస్ నుండి ప్యూన్ వచ్చాడు. ''అయ్యగారు మధ్యాహ్నం ఇంటికి రారు. కేరియరు పంపించమన్నారు'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

● ● ●

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

● ● ●



**ఏ చిన్న తప్పు జరిగినా క్షమించకుండా బెల్టుతో వాతలు పడేలా కొట్టేవాడు.**

ఏ పాటు తప్పినా సాపాటు తప్పదన్నట్లు వంట పనులకుపక్రమించి, ఒంటిగంటకల్లా భోజనం రెడీచేసి కేరియరు ఆఫీసుకు పంపించింది. ఉదయం టిఫిన్ చెయ్యకపోయినా, మధ్యాహ్నం కూడ భోజనం సయించక పస్తు పడుకుంది. సాయంకాలం ఆరుగంటలకు భర్త ఆఫీసు నుండి తిరిగొచ్చాడు.

బెడ్‌రూం తాళం తియ్యగానే ప్రశాంతిని బయటకు తీసి ఎంతో బుజ్జగించి భోజనం పెట్టింది. తరువాత తనుకూడా కొంచెం తింది. కానీ ఆశ్చర్యం ఏమిటంటే అంతగా ఏడ్చి ఓ రోజంతా బందీగా ఉన్నా ప్రశాంతి ముఖంలో ఏ భావమూ లేదు. బాహ్యాతీత జ్ఞానంలో ఉన్న యోగినిలా నిర్వికారంగా ఉంది. ఆదినారాయణ కూడా కూతుర్ని అంతగా బాధ పెట్టినందుకు ఏ విధమైన పశ్చాత్తాపం వ్యక్తం చెయ్యలేదు. ప్రశాంతి తండ్రిపై ఏ కోపం పెట్టుకోకుండా కలిసిపోయి మామూలుగానే మాట్లాడింది.

★ ★ ★

రోజులు సంవత్సరాలుగా మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఆదినారాయణ గడ్డం పూర్తిగా నెరిసింది. రామలక్ష్మికి తలలో చాల భాగం వెండి వెంట్రుకలు తెల్లగా కన బడుతున్నాయి. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. అటు పడమర చూస్తే ఠీవిగా నిలుచున్న శేషాద్రి, గరుడాద్రిగా గల సప్తగిరులు. ఆ కొండలకు వడ్డాణంలా చుట్టుకున్న రోడ్డుపై వయ్యారంగా పరుగెత్తే కారులు, బస్సులు, ఆ కొండ దిగువన మెడికల్ కాలేజి, ఆస్పత్రి, హాస్టల్ తదితర బిల్డింగ్స్ పిల్లలు పేర్చిన ఆట బొమ్మల్లా ఉన్నాయి. మధ్యలో ఏపుగా ఎత్తుగా పెరిగిన అశోక, వేప, నేరేడు మొదలగు రకరకాల చెట్లున్నాయి. అవి ఠీవిగా నిలబడి గర్వంగా తలలూపుతున్నాయి. తూర్పువేపుగా తిరుపతి పట్టణం శోభాయమానంగా రంగుల హరివిల్లులా వెలిగిపోతూంది. "ఇక్కడ నిజంగా ప్రతి రోజూ పండుగే. శ్రీ వెంకటేశ్వర స్వామివారికి నిత్యకళ్యాణమే" అనుకుంది రామ లక్ష్మి. ఆ దంపతులిరువురూ ఎస్.వి. మెడికల్ కాలేజి ఆడిటోరియమ్‌లో అతిథుల

## 'దేవానంద్' గట్టెక్కాడు



'దేవానంద్' ఒకేసారి ఇంగ్లీషు, హిందీ భాషలలో నిర్మిస్తున్న 'ప్యార్ కా తరానా' చిత్రంలో నగ్న దృశ్యాలను చిత్రీకరించాడు. ఆ కారణంగా ఆ చిత్రం సెన్సార్ వారి చేతుల్లో ఇరుక్కుంది. ఈ మధ్య ఇండియాలోను, డెన్మార్క్‌లోను సెన్సార్ క్లియరెన్స్ దొరికింది. ఇండియాలో ఆ సీన్లను కట్ చేశారు. డెన్మార్క్‌లో వాటిని అలాగే వుంచి పురుషులే కాక స్త్రీలు కూడా ఆనందిస్తున్నారని దేవానంద్ చెప్పాడు.

---

సీట్లలో కూర్చుని ఉన్నారు. రకరకాల తోరణాలతో రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా కాలేజి డే జరుపుకుంటున్నారు ఆ కాలేజి వారు. ప్రశాంతితో బాటు ఇతర ఫస్ట్ ర్యాంక్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసేది కూడా ఈరోజే. ఆదినారాయణ, రామలక్ష్మిల ముద్దులపట్టి ప్రశాంతి క్లాస్ ఫస్టు మాత్రమే కాకుండా యూనివర్శిటీలో కూడా ఫస్ట్ ర్యాంక్ సంపాదించింది. అందుకే గోల్డ్ మెడల్ కూడా కాలేజివారు ప్రదానం చేస్తున్నారు. అందులకే ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రశాంతి తల్లిదండ్రులకు ఆహ్వానం అందింది.

కాలేజి వార్షికోత్సవ కార్యక్రమాల్లో అధ్యక్షోపన్యాసాలు, ముఖ్య అతిథి తొలిపలుకులు మొదలగు భాగాలు పూర్తయ్యాయి. బహుమతుల ప్రదానం కార్యక్రమం ప్రారంభమయ్యింది. చిత్తూరు జిల్లా కలెక్టరు గారు బహుమతులందరికీ అందజేస్తున్నారు. కుమారి ప్రశాంతి పేరు కనీసం నాలుగుసార్లకు పైనే పిలిచారు. ప్రతి సబ్జెక్ట్‌లో తనే ఫస్ట్. గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తూ కలెక్టర్ గారు ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. టెన్త్‌లోనూ, ఇంటర్‌లోనూ స్టేట్ ర్యాంకులు సాధించడమే గాక, మెడికల్ కాలేజిలో కూడా బంగారు పతకం సాధించిన కుమార్తె డయాస్ నుండి తిరిగి వస్తూంటే చప్పట్లతో ఆడిటోరియం దద్దరిల్లిపోయింది. ఆదినారాయణ ముందు ఒకింత గర్వంగానూ, తరువాత ఉద్వేగంతోనూ ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఆఫీసు నుండి స్కూటర్‌లో ఇంటికి చేరుకున్న ఆదినారాయణకు తలుపుకు వేసియున్న తాళం కప్ప వెక్కిరిస్తూ కనబడింది. ఎన్నో ఏళ్ళ తమ వైవాహిక జీవితంలో ఇలా ఎన్నడూ జరగలేదు. ఆశ్చర్యపోయిన ఆదినారాయణ ఆలోచిస్తూ ఇంటి ముంగిట్లో కూర్చున్నారు. అరగంట తరువాత హడావుడిగా ప్రవేశించిన రామలక్ష్మి తాళం తీస్తూ భర్తను చూసి కంగారు పడింది.

"నేను వద్దన్నా కాదు కూడదని బలవంతం చేసి నన్ను పేరంటానికి శారద వాళ్ళు తీసుకెళ్ళారండి. మీరొచ్చి ఎంత సేపయింది?" మౌనంగా లోపలికి ప్రవేశించిన ఆదినారాయణ జవాబు చెప్పలేదు కాఫీ కప్పు తీసుకుని హాల్లోకి ప్రవేశించిన రామలక్ష్మికి స్నానం చేసి ఒళ్ళు తుడుచుకుంటున్న భర్త కనిపించాడు. కాఫీ టీపాయ్ మీద పెట్టి "ఇంకా కోపం పోలేదా" గోముగా అడిగింది.

కనీసం ఓ చీటీ రాసి గొళ్ళానికి తగిలించొచ్చుగా. నేనెంత కంగారు పడ్డానో నీకెలా తెలుస్తుంది. విస్ఫారంగా అన్నాడు ఆది నారాయణ. "సరే నాదే పొరబాటు. ఒప్పుకుంటున్నాను. మీరు ఓ.కె. అంటే వేణుగోపాలస్వామి గుడి కెళ్ళొద్దామండీ. ఈ రోజు మన ప్రశాంతి పుట్టినరోజు కదా!"

"అవును నిన్నటితో దానికి ఇరవై రెండేళ్ళు పూర్తయ్యాయి. ఈ ఏడాది గడిస్తే హౌస్ సర్జన్సీ కూడ పూర్తవుతుంది. తరువాత ఈ ఊళ్ళోనే ప్రాక్టీసు పెట్టించి మంచి డాక్టరును చూసి పెళ్ళి చేద్దాం."

"నో... నో... నేనొప్పుకోను."

"అంటే నీ ఉద్దేశ్యం ప్రశాంతికి పెళ్ళి చెయ్యకూడదనా?"

"అది కాదండీ. ఈ కాలంలో ఉత్తి మెడిసిన్ చదివితే లాభం లేదు. మన ప్రశాంతి ఎమ్.డి. చదవాలి. గొప్ప గైనకాలజిస్ట్ కావాలి."

"గుడ్. చాలా దూరం ఆలోచించావ్. గుడ్ ఐడియా."

"ఇదే ఆలస్యం. కమాన్ గెట్ రెడీ. రాత్రికి భోజనం కూడా బయటే!" రామలక్ష్మి బాత్ రూం వేపు పరుగులెట్టింది. మళ్ళీ తలుపు మీద దబ దబ చప్పుడు దానితో బాటు, "పోస్ట్‌మాన్— సార్... టెలిగ్రాం" అని వినిపించింది. సంతకం చేసి టెలిగ్రాం అందుకుని చదివాడు.

"ప్రశాంతి సీరియస్. స్టార్ట్ అర్జెంట్" నమ్మబుద్ధి కాలేదు. తల విదిల్చి మళ్ళీ చదివాడు అవే మాటలు. నిన్ననే కదా ప్రశాంతి ఉత్తరం రాసింది.

తను బాగున్నట్లు ఫైనల్ ఎగ్జామ్స్ రిజల్టు కోసం ఎదురు చూస్తున్నట్లు రాసింది అంతలోకే ఈ అశనిపాతం ఎలా సాధ్యం. టవల్‌తో తుడుచుకుంటున్న భార్యను చూసేసరికి కళ్ళలో నీళ్ళు చిమ్మాయి. తన ప్రశాంతి కేమయి ఉంటుంది. ఆమె కేమయినా ఉంటే తను ఓర్చుకోగలడా? మరి ఈ పిచ్చితల్లి ప్రశాంతిపై ఈగవాలితే ఓర్వలేదే. మరేదయినా జరిగితే బ్రతకగలదా. అయినా అంత కీడెందుకు శంకించాలి. ఏదైనా జబ్బుచేసి ఆస్పత్రిలో చేర్పించారేమో. ఏ విషయం తేలాలంటే వెంటనే తిరుపతికి ప్రయాణం కట్టాల్సిందే.

"రెండోసారి చెబుతున్నాను. గుడి కెళ్ళేందుకాలస్యమౌతుంది. మహానుభావా ఇకనైనా లేవండి."

"నన్ను క్షమించు లక్ష్మీ. నేనర్జంటుగా ప్రశాంతిని చూడాలి. వెడుతున్నాను."

"ఏమిటండీ పిచ్చి మాటలు. ఇప్పుడేగా

● ● ●

**ఉదయం టిఫిన్ చెయ్యకపోయినా మధ్యాహ్నం కూడా భోజనం సయించక పస్తు పడుకుంది**

● ● ●

మనం గుడికెళ్ళాలనుకున్నాము.'' అన్న ఆమె మాటలకు బదులు చెప్పకుండా బయట కెళ్ళిపోయాడు. రామలక్ష్మి అవాక్కై నిలబిపోయింది.

అందిన బస్‌లో తిరుపతికి చేరుకున్నాడు. గుబగుబలాడుతున్న గుండెల్ని బిక్కబట్టుకుని మెడికల్ కాలేజి హాస్టల్ చేరుకున్నాడు ఆటోలో. ఎప్పటిలా బయటకొచ్చి మాట్లాడుతుందనుకున్న ప్రశాంతి కనిపించనేలేదు. చాలమంది విద్యార్థినులు తనకేసి వింతగా చూసి గుసగుస లాడుకోవడం గమనించాడు. ఇంతలో వాచ్‌మన్ ఆదినారాయణను వార్డెన్ దగ్గరకు తీసుకెళ్ళాడు. వార్డెన్ ఆయనను కుర్చీలో కూర్చోబెట్టి ఓ లెటర్ చేతికిచ్చింది అది ప్రశాంతి రాసిన చివరి లెటర్.

## ●●● ఈ కాలంలో ఉత్తి మెడిసిన్ చదివితే లాభం లేదు. మన ప్రశాంతి ఎమ్.డి. చదవాలి ●●●

నాన్న గారూ,

నన్ను క్షమించండి. ఇలాంటి పరిస్థితి వస్తుందని నేనెన్నడూ అనుకోలేదు. అందుకనే ఈ ప్రత్యేకమైన లెటర్ రాస్తున్నాను. నాన్నా నన్ను మీరు ఎంతో ప్రేమతో అనునయించారు. అంతకు మించిన క్రమశిక్షణతో పెంచారు. ప్రతీ క్లాసులో ఫస్ట్ ర్యాంక్ పొందేలా చేశారు. ఈ ఫైనలియర్ పరీక్షల్లో నా ఆరోగ్యం పాడయింది. ఎంత చదువుదామని ప్రయత్నం చేసినా నా వల్ల కాలేదు. నేను పరీక్షలు రాశాను. కానీ ఫస్ట్ ర్యాంక్ రాలేదు. నెంబర్ టూగా ఉండే రాఘవేంద్రకు ఫస్ట్ ర్యాంక్ వచ్చింది నాకు మూడో స్థానం వచ్చింది. ఇది చాలా ఘోరమైన అవమానం. నేను దీన్ని స్వీకరించలేకపోతున్నాను.

మనిషిలో వుండే సర్వశక్తియుక్తులు ఫస్ట్‌ర్యాంక్ సాధించడానికే ఉపయోగపడాలి. అదే జీవితానికి అర్థం, పరమార్థం. ఈ సంవత్సరం మాత్రం నా అంచనాలన్నీ తారుమారు అయ్యాయి. అందుకే నేనీ ఓటమితో రాజీ పడలేక పోతున్నాను. ఇక ఈ లోకంలో బ్రతికియుండడం అనవసరమనిపిస్తున్నది. అందుకే శాశ్వతంగా శెలవు తీసుకుంటున్నాను. ఇది తెలుసుకున్న తరువాత మీరు చాల బాధపడతారని తెలుసు. అమ్మకూడ ఈ విషయం తెలిస్తే భరించలేదని తెలుసు. కాని ఏం చెయ్యను?'' నేను తప్పకుండా వెళ్ళిపోవాలి'' అని నిర్ణయం తీసుకున్నాను. కనుక ఈ విషయంలో మార్పు ఉండదు. నేను వెళ్ళిపోతున్నాను నాన్నా. నన్ను క్షమించండి. ఈ క్రమశిక్షణ మీరు నేర్పిందే. అమ్మకు మీరే ధైర్యం చెప్పండి. తెలిసి నేనేనాడూ మీకు మనస్తాపం కలిగించలేదు. ఎప్పుడైనా తెలీక జరిగుంటే నన్ను క్షమిస్తారు కదూ...!''

రెండు కళ్ళూ నీళ్ళతో నిండి కనుపించడం మానేశాయి. ఆదినారాయణ గుండెలు పగిలే దుఃఖంతో బావురుమని ఏడ్చాడు.

''అమ్మా ప్రశాంతీ! ఎంత పని చేశావు తల్లీ. చాల పెద్ద శిక్షే వేశావు మాకు. నిన్ను ఎంతో కఠినంగా క్రమశిక్షణతో పెంచినా అది నీ మంచికే అనుకున్నాను గాని అదే నీ పాలిటి ఉరిత్రాడు అవుతుందని కలలో కూడా ఊహించలేదు కదమ్మా. అమ్మా ఒక్కగా నొక్క బిడ్డవని, ఆడైనా, మగైనా నీవేనని, నిన్నెంతో గొప్పదాన్ని చెయ్యాలని ఎన్నో కలలుకన్నాము. అవన్నీ బుగ్గి పాలయ్యాయి. చిన్నతనంలో నిన్ను కొట్టిన ఈ చేతులను నరికినా పాపం లేదు. నీ చావుకి కారణం నేనే. నిన్ను చంపింది నేనే.

అనుకుని కుములుతున్న ఆదినారాయణను ఓదార్చాలని విద్యార్థులు, వార్డెన్ గారు ప్రయత్నించారు. సింహంలా గంభీరంగా వుండే ఆదినారాయణ అలా బావురుమనడం చాలా దారుణంగా ఉంది.

నెమ్మదిగా ప్రశాంతి శవాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించారు. ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్న ఆదినారాయణను ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కారు దగ్గరకు నడిపించుకువెళ్ళాడు. మరో రెండు వ్యాన్లలో ప్రశాంతి ఫ్రెండ్స్ క్లాస్‌మేట్స్ అధ్యాపకులు ప్రశాంతి అంతిమయాత్రకు తరలి వెళ్ళడానికి రెడీ అవుతున్నారు. కారెక్కే ముందు ఆదినారాయణ గొంతు ఎలాగో పెగల్చుకుని చెప్పాడు.

''బిడ్డల్లారా? చిన్నారుల్లారా! ఈ గొప్ప చదువు చదివే మీరెంతో అదృష్టవంతులు. మీ తల్లిదండ్రులు మరింత అదృష్టవంతులు. కానీ ఈ చదువుల్లో అనారోగ్యపోటీకి పాల్పడి ప్రాణాలు బలి తీసుకోకూడదు. విద్యలు గెలుపు, ఓటములు, జీవన్ మృత్యు పోరాటం కాకూడదు. జీవితంలో చదువు ఒక భాగం మాత్రమే. ఈ జీవితమే చదువని మీరు అనుకోవద్దు. దయచేసి ఈ సత్యం గ్రహించండి. మీ జీవితాలు ఎంతో అమూల్యమైనవి. నేను చేసిన చిన్న పొరబాటుకు భారీ మూల్యం చెల్లించాను. ఇంకెవరి జీవితంలో ఇలా ఎన్నటికీ జరుగకూడదు. అదే నా కోరిక. మన్నిస్తారు కదూ! జీవితంలో నా సర్వస్వం అనుకున్న ప్రశాంతినే పోగొట్టుకున్నాను. ఇంకేం చెప్పను'' డగ్గుత్తికతో ఇక మాట రాక కారెక్కి పోతున్న ఆయనను చూసి జీవితంలో ఒక క్రొత్త సత్యాన్ని తెలుసుకున్నట్లు ఫీలయ్యారు కాలేజి పిల్లలు. ●



## ఇక్కడికన్నా అక్కడ!

దామిని చిత్రం ఇండియాలో కన్నా ఇతర దేశాల్లో సూపర్ డూపర్ హిట్టయ్యింది. డెన్మార్క్‌లో ఈ చిత్రం టిక్కెట్లు దొరక్క రోజూ 200 మంది వెనక్కి తిరిగి వెళుతున్నారట. ఇలా విడుదలైన అనేక కేంద్రాల్లో జరుగుతోందట. ఈ చిత్ర కథానాయిక మీనాక్షి శేషాద్రి వివిధ ప్రదర్శనలు నిమిత్తం యు.ఎస్.ఏ, కెనడాలు తిరిగి వచ్చింది. ఇటీవల మీనాక్షి ఇతర విషయాలు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. బొంబాయి యూనివర్శిటీలో యం.ఏ. పరీక్షలకు అప్పియర్ అవనున్న మీనాక్షి ఇతర విషయాలు వదలి తీవ్రంగా చదువులో మునిగింది.